క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ఊరేగింపు


విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ: కార్తీకమాసం ప్రారంభం కావడంతో వెంకటరాంపురం పంతులుబాబు విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం ఆదివారం ప్రారంభం చేశారు. ఈ ప్రాంతంతో ఎంతో గొప్ప పేరు పొందిన పాకలపాడు పంతులుబాబు ఆశ్రమం నుంచి విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమంలో పుత్తడిగైరంపేట, వెంకటరాంపురం, ఎర్రవరం గ్రామస్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం నెలరోజులపాటు ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భక్తులకు ఆరాధ్య దైవంగా భావించే ఆశ్రమంలో ప్రతి సోమవారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వర్మ మాస్టారుకు ఇన్నర్ వీల్ అవార్డు


అనకాపల్లి బాలికోన్నత పాఠశాలలో వర్మ మాస్టారుని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల : గణిత ఉపాధ్యాయులకు విద్యా బోధనలో సాంకేతికతను వినియోగించడంపై శిక్షణ ఇవ్వడమే కాకుండా వినూత్న రీతిలో బోధించే ఉపాధ్యాయులును సన్మాన సభ జరిగింది. అనకాపల్లి బాలికోన్నత పాఠశాలల్లో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో వీరనారాయణం హైస్కూలు లెక్కలు, ఆంగ్ల ఉపాధ్యాయుడు అయిన వర్మ మాస్టారును ఇన్నర్ వీల్ ఎడ్యుకేషనిస్టు అవార్డుతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీదేవి పద్మ, మంజు భార్గవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టారు తనకు అవార్డు అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా చినబాబు


కచ్చాల చినబాబు

నర్సీపట్నం : నర్సీపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నర్సీపట్నం మండలం, మెట్టపాలెం గ్రామానికి చెందిన కచ్చాల చినబాబు నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన పదవికి వన్నుతెచ్చేలా కృషి చేస్తానన్నారు. నాయకత్వాన్ని సమన్వయం చేసుకుని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చినబాబు తెలిపారు.

దత్తాశ్రమంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట


నూతనంగా ప్రతిష్టించిన సుబ్రహ్మణేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పద్మావతి

నర్సీపట్నం : బలిఘట్టంలో శ్రీదత్తాశ్రమంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పాల్గొని విగ్రహాన్ని ప్రతిష్టించారు. జరిగిన విశేష పుజల్లో పాల్గొన్నారు. ఈ ఆలయాన్ని జ్యోతిష్య సిద్ధాంతి గుమ్ముడు ప్రసాద్ నిర్మించారు. ఉత్తర వాహిని పుణ్యనది తీరం అత్యంత ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిందని ఆమె పేర్కొన్నారు.

నేడు పిండ్రంగిలో రెవెన్యూ గ్రామసభ

కె.కోటపాడు: మండలంలోని పిండ్రంగి గ్రామంలో సోమవారం రీసర్వే- గ్రామసభను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై సమావేశంలో వినతులు అందించవచ్చని అన్నారు. రీసర్వే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విస్తారంగా టమాటా సాగు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో గల రైతులు టమాటా పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. టమాటాకు మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలవ్యవధిలో దిగుబడి ప్రారంభమయ్యే పంట కావడంతో టమాటా సాగును రైతులు చేపడుతున్నారు. మండలంలో బొట్టవానిపాలెం, కె.కె.అగ్రహారం, సూదివలస, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, కింతాడ, పింద్రంగి, కొరువాడ గ్రామాల్లో 150 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారు.

శివం..సుందరం.. క్షేత్ర దర్శనం


మాడుగులలో వెలసిన ఉబ్బలింగేశ్వరాలయం

- ప్రకృతి రమణీయత నడుమ పురాతన శైవక్షేత్రాలు
- ఆహ్లాదం, ఆధ్యాత్మికతకు నిలయాలు


మాడుగుల : కార్తీక మాసం ప్రారంభం కావడంతో మండలంలో గల శైవక్షేత్రాలు సిద్ధం అవుతున్నాయి. నియోజకవర్గంలో 10 శివాలయాలు ఉండగా ఒక్క మాడుగుల మండలంలో 6 అతి పురాతన శైవక్షేత్రాలు ఉండడం విశేషం. దీంతో కార్తీక మాసంలో ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా పెరుగుతుంది. అతి పురాతన ఆలయాలు కావడంతో కార్తీక మాసం అంతా భక్తులుతో కిటకిటలాడుతాయి.

పాండవులు పూజించిన ఉబ్బలింగేశ్వరాలయం

ఈ ఆలయం మాడుగుల కోటకు పట్టణానికి ఉత్తర దిక్కుగా పాండవుల కొండను ఆనుకుని వెలసింది. ఇక్కడ అనేకమైన ఔషధ మొక్కలతో రమణీయంగా పర్వతాలుంటాయి. ఇక్కడ సెలయేరు చాలా పరిశుభ్రంగా ప్రవహిస్తుంది. ఈ ఆలయం కూడా పాండవులు వనవాస కాలంలో ఈ శివలింగానికి పూజలు నిర్వహించారని చరిత్ర కారులు చెబుతున్నారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాలు నుంచి వనభోజనాలకు అధిక సంఖ్యలో భక్తులు కార్తీక మాసంలో ఇక్కడకు వస్తుంటారు.

పాలగెడ్డ చెంతన శ్రీకృష్ణభూపాలేశ్వరుని ఆలయం

ఈ ఆలయం మాడుగుల మహరాజుల కోటకు కిలో మీటరు దూరంలో పశ్చిమ దిశగా వెలసింది. మహరాజుల కాలానికి పూర్వం వెలసిందని, అయితే ఈ ప్రాంతాన్ని పరిపాలించే రాజులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి అప్పటి పరిపాలనాధీశుడు శ్రీకృష్ణ భూపాలేశ్వరుని పేరున ఈ ఆలయానికి నామకరణ చేశారని చెబుతుంటారు. అయితే ఆ ఆలయాన్ని ఆనుకుని ఆహ్లాదకరమైన కొండలు నడుమ అందమైన పాలగెడ్డ జలాశయం ఉండడంతో ఈ వాతావరణం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. కార్తీక మాసంలో ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు.


మాడుగులలో శ్రీకృష్ణ భూపాలేశ్వరాలయం

భీముడు ప్రతిష్టించిన ఉమాభీమలింగేశ్వర ఆలయం

ఈ ఆలయం మాడుగులలో మహరాజు కోటకు తూర్పుదిశగా కిలోమీటరు దూరంలో వెలసింది. ఈ ఆలయంలో శివలింగాన్ని స్వయంగా భీముడే ప్రతిష్టించారని చెబుతుంటారు. పచ్చని పంట పొలాలును ఆనుకుని ఉండడంతో పర్యాటకులు ఈ ఆలయానికి అధికంగా వస్తుంటారు.

కోటిజన్మల పుణ్య ఫలం గుప్త లింగేశ్వర ఆలయ దర్శనం

ఈ ఆలయం మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌కు పడమర దిశగా రెండు కిలోమీటర్ల దూరంలో వెలసింది. ఈ ఆలయం ప్రాంగణానికి సమీపంలో పెద్దేరు నది ఉత్తర దిశగా ప్రవహిస్తుంది. ఇక్కడ ఉత్తరాయణ పుణ్య స్నానాలు కూడా ఉన్నాయి. దీంతో భక్తులు ఉత్తర దిశగా ప్రవహిస్తున్న పెద్దేరు నదిలో స్నానం చేసి ఈ ఆలయంలో అభిషేకం చేయించుకుంటే కోటి జన్మల పుణ్యం వస్తుందని, ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో శివలింగాన్ని పాండవులు పూజించేవారని చెబుతుంటారు. ఆలయ ప్రాంగణంలో ఔషధ మొక్కలు ఉండడం విశేషం,

ప్రకృతి రమణీయం.. భీమలింగేశ్వరాలయం

ఇది మాడుగుల మండలంలో జాలంపల్లి పంచాయతీ పిట్టగెడ్డ గ్రామం సమీపంలో వెలసింది. ఇది అతిపురాతన ఆలయానికి మూడు పక్కలా అందమైన పర్వతాలతో ఈ ప్రాంతం ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఈ ఆలయం సమీపంలో పెద్దేరు జలాశయం ఉండడంతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

నానాటికీ పెరుగుతున్న ముఖ లింగేశ్వరుడు..

ఈ ఆలయం మాడుగుల మండలం వొమ్మలి జగన్నాథపురం గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉరలోవ కొండ సమీపంలో వెలసింది. ఈ ఆలయం కూడా పురాతన ఆలయంగా చెపుతుంటారు. ఈ ఆలయంలో శివలింగం పెరుగుతూ ఉంటుందని, స్థానిక భక్తులు చెబుతుంటారు. దీంతో కార్తీక మాసంలో అధిక సంఖ్యలో ఈ ఆలయానికి వస్తుంటారు. ఇక్కడ వనభోజనాలు కూడా ఏర్పాటు చేసుకుంటారు.

గెలుపునకు సహకరించండి

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు


ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీలు

నర్సీపట్నం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తన గెలుపునకు ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని గాదె శ్రీనివాసనాయుడు పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో ఆదివారం శ్రీనివాసనాయుడు ఉపాధ్యాయులను కలసి మద్దతు కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలు, పలువురు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. సీఆర్టీలను రెగ్యులర్ చేయించేందుకు, నాన్‌టీచింగ్ సిబ్బందిరి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పెంచి భర్తీ చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పీఆర్టీయు కన్వీనర్ డి.గోపీనాథ్, చిన్నారావు, పీఆర్టీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.అప్పారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కురచ రమణ, పీడీల అసోసియేషన్ శ్రీనివాసరావు, తమ్మిల మాణిక్యం పాల్గొన్నారు.

వృద్ధులు, విద్యార్థులకు వితరణ


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు సంఘం అధ్యక్షురాలు అక్కయ్యమ్మ

నాతవరం: సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలక మని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు అన్నా రు. మండల కేంద్రంలో ఆదివారం అమ్మ వాసవీ స్వచ్ఛంద సేవా సంఘం మండల శాఖ అధ్యక్షురా లు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ, సంఘం గౌరవ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర పేదలకు దుస్తులు, విద్యార్థులకు సామగ్రి అందజేశారు. వాటిని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా 120 మంది వృద్ధులకు దుస్తులు, 140 మంది విద్యార్థులకు చదువుకోవడానికి కావలసిన సామాగ్రి పంపిణీ చేశారు. అమ్మ వాసవీ సేవా సంఘం ఈ ప్రాంతంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సూర్యచంద్ర, నాతవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు అపిరెడ్డి మాణిక్యం పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలను పరిష్కరించాలి


సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన ఆయన అక్కడ పలు సమస్యలను గుర్తించినట్టు స్థానిక విలేకరులకు తెలిపారు. నాడు-నేడులో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నిరుపయోగంగా ఉన్న సోలార్ ప్యానల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అరకొరగా ఉన్న తరగతి గదులు, బాత్ రూమ్‌లు, ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాఠశాలలో 259 మంది విద్యార్థులు ఉన్నారని, సైన్స్, తెలుగు ఉపాధ్యాయులు లేక ఆ సబ్జెక్టులలో సక్రమంగా విద్యాబోధన జరగని పరిస్థితి నెలకొందన్నారు. మేడపై 11 బాత్ రూమ్‌లు ఉన్నప్పటికీ సెప్టిక్ ట్యాంక్ మూత పడిపోవడంతో వినియోగంలో లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. సోలార్ ప్యానల్ పనిచేయడం లేదని, ఇన్వర్టర్లు సరిపోక రాత్రి పూట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు అవస్థలు పడుతున్నారన్నారు. కస్తూర్బా పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు.

సుపథ ప్రతిభ పరీక్షలకు 435 మంది హాజరు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సుపథ వ్యవస్థాపకుడు యు.వి.ఎ.ఎన్.రాజు తదితరులు

దేవరాపల్లి : విద్యార్థుల్లో మానవత విలువలు పెంపొందించడంతో పాటు మాతృభాష, భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే సుపథ ధ్యేయమని ఆ సంస్థ రూపకర్త యు.వి.ఎ.ఎన్.రాజు అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో ప్రారంభించిన సంస్థ ద్వారా ప్రస్తుత తరానికి మానవతా విలువల ఆవశ్యకతను వివరిస్తూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 20 ఏళ్లగా సుపథ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో పద్య పఠనం, శ్లోక పఠనం, సుపథ గేయాలు, కృష్ణాష్టకం ప్రతిభ పరీక్షలను నిర్వహించారు. నాకు నచ్చిన దేశ నాయకుడు, మంచి విద్యార్థి అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాయంత్రం విజేతలకు సంస్థ వ్యవస్థాపకుడు రాజు, సంస్థ సభ్యులు, మాజీ ఎంపీపీ భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుపథ కార్యకర్తలు కె.శ్రీనివాసు, బి.వి. దేముళ్లు, వై.బి.వి. ఉదయ్‌కుమార్, డి.దేముడు, సిహెచ్.సూర్యనారాయణ, వై.త్రినాథ్, ఐ.నారాయణరావు, నాగ కరుణ, జి.చిన్నంనాయుడు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

• కనువిందు చేస్తున్న నీలిమేఘాలు


ఖరీఫ్‌లో వరి చేను కళకళలాడుతోంది. పొలాలు పచ్చగా ఉన్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎండ కాసి సాయంత్రం కాగానే ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో నీలిమేఘాలు ప్రత్యక్షమై కనువిందు చేశాయి. - రోలుగుంట

త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతి


త్రిశూల పర్వతంపైకి బాట వేస్తున్న నిర్వాహకులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలోని ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలోని త్రిశూల పర్వతంపై కృత్తిక అఖండ జ్యోతి దర్శనానికి భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి పర్వదినాన అఖండ జ్యోతి ఏర్పాటుకు నిర్వాహకులు గవిరెడ్డి వెంకట రమణ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొట్ట మొదటగా అఖండ జ్యోతి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అఖండ జ్యోతి ఏర్పాటుతో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పర్వతంపైకి వెళ్లేందుకు బాట వేసే ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు జీకే పోటీలు

నర్సీపట్నం : స్టార్ ఫౌండేషన్ సొసైటీ పూర్వ విద్యార్థి, పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు (ఐపీఎస్) వారి సౌజన్యంతో సోమవారం స్టార్ జీకే టెస్ట్ నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎస్.శర్మ, వి.నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎల్.రమేష్ తెలిపారు. సొసైటీ తరపున మూడేళ్లగా స్టార్ జీకే టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాల నుంచి సుమారు 5వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

తొలి కార్తీక సోమవారానికి శివాలయాలు ముస్తాబు


ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు


విద్యుద్దీపాలంకరణలో ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వరుని ఆలయం

మాడుగుల రూరల్ : కార్తీక మాసం తొలి కార్తీక సోమవారానికి మండలంలో శివాలయాలు ముస్తాబు చేసారు. ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంతో పాటు, కె.జె.పురం, వీరవల్లి, జంపెన, పిట్టగెడ్డ, వీరనారాయణం, వీజేపురం, తదితర శివాలయాల్లో సోమ వారం తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకా లు, నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మాడుగులలో స్వర్గలింగేశ్వర, ఉమాభీమలింగేశ్వర, ఉబ్బలింగేశ్వర, కృష్ణ భూపాలేశ్వర, పార్థ సారథి ఆలయాల్లో పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తులతో శివాలయాలు కిటకిట

చీడికాడ : అత్యంత పవిత్రమైన కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో మండలంలోని తురువోలు, పెదగోగాడ, బి.సింగవరం, ఖండివరం, ఎల్.బి.పట్నం, చీడికాడ శివాలయాల్లో తెల్లవారు జామునుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలు హరహర మహాదేవా అంటూ భక్తులు చేసిన నినాదాలతో దేవాలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ


చిత్రపటాలతో దేవతామూర్తులను ప్రతిష్టించి అలంకరించిన అయ్యప్పస్వాములు


అంబలం పూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షధారులు

నాతవరం : స్థానిక నల్లగొండమ్మ ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప అంబలం పూజ శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పోలిరెడ్డి రాజు ఆధ్వర్యంలో పూజా మండపాన్ని 18 మెట్లు అందంగా తయారు చేశారు. అయ్యప్ప స్వామి దేవతామూర్తులు చిత్రపటాలతో ప్రతిష్టించి పూలతో అలంకరణ చేయడంతో చూపరులను ఎంతోగానో ఆకట్టుకుంది. గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి అయ్యప్పస్వామి భక్తి గీతాలతో చేసిన భజనలు భక్తులను రంజింపజేశాయి. పూజా కార్యక్రమాన్ని చూసేందుకు గ్రామంలో అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. అయ్యప్ప మాలధారులతో అయ్యన్న నామస్మరణతో ఈ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


కె.కోటపాడులో గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు


గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ గవర వీధి వాసులు శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉత్సవ మూర్తుల విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి అబిద్‌సెంటర్ మీదుగా ఊరేగింపుగా గవరవీధి తరలించి, మండపంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ప్రతిష్టించారు. కార్తీక మాసం నెల రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం సారె చీరతో అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. విగ్రహాల ఊరేగింపులో మహిళలు పాల్గొన్నారు.

కె.కోటపాడులో గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో గల గౌరీ పరమేశ్వరుల విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాగుల చవితి పర్వదినం రోజున గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని జరపనున్నారు. గౌరీపరమేశ్వరులకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు జరిపారు.

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గౌరీపౌర్ణమి రోజు నుంచి ఈ ఉత్సవాలు ముగింపు రోజు వరకూ రాత్రిళ్లు భజన, చిడతలు, కోలాటం, జానపద, పౌరాణిక ప్రదర్శనలను నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా సర్పంచ్ కాంతమ్మ గ్రామంలో మహిళలకు కోలాటంపై శిక్షణ ఇచ్చి ప్రదర్శిస్తున్నారు. మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామంలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి పీఠం వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు వారి కుమారుడు కల్యాన్ మణిదీప్ ఆర్థిక సహకారంతో రూ. 50,000 నగదును ఆదివారం అందజేశారు. గొల్లవిల్లి రామారావు వరహాలమ్మ జ్ఞాపకార్థం ఈ నగదును అయ్యప్ప స్వామి పీఠం గురుస్వాములు రావాల హరి, అప్పాన ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు పోతిన జగదీశ్, ముమ్మిన రమణబాబు, అప్పాన నాయుడు, తదితర స్వాములు పాల్గొన్నారు.

ఈ 'నడక'యాతన ఇంకెన్నాళ్లు!

- గిరిజనులకు రోడ్డు సౌకర్యం కలేనా..
- హామీలు మరిచిన కూటమి నాయకులు
- నిధులు మంజూరైనా కష్టాలు తీరలేదు
- డొంకాడ గ్రామస్తుల ఆవేదన

రోడ్డు లేక నరకయాతన.. వర్షాకాలంలో మరింత దుర్భరం. ఆ గ్రామంలో ఉన్నవారంతా గిరిజన ప్రజలే. పిల్లలు స్కూలుకు వెళ్లాలన్నా, గ్రామస్తులు తాము పండించిన పంటలు అమ్ముకోవాలన్నా, ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రికి వెళ్లాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా కనీసం మూడు కిలోమీటర్లు అటవీమార్గంలో నడిచి వెళ్లి రావాల్సిందే. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం ఎరగని ఆరిల్లోవ అటవీప్రాంతంలో గిరిజన గ్రామం డొంకాడ దుస్థితి ఇది.


అధ్వానంగా ఉన్న డొంకాడ రోడ్డు


గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఆవేదన చెందుతున్న డొంకాడ గిరిజనులు

గొలుగొండ : మండలంలో ఆరిల్లోవ అటవీప్రాంతంలో పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడుతున్నారు. వీరంతా 10 ఏళ్ల క్రితం అల్లూరి జిల్లా పలకజీడి గ్రామంలో నివాసం ఉండేవారు. సుమారుగా 150 మంది గిరిజన ప్రజలు పలకజీడిలో నివాసం ఉంటూ అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసిన పాపానికి వీరిని మావోయిస్టులు బహిష్కరణ చేశారు. దీంతో వీరంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆరిల్లోవ అటవీప్రాంతంలో తలదాచుకున్నారు. వీరికి అప్పట్లో రేషన్‌కార్డులు, విద్యుత్ సౌకర్యం కల్పించడం తప్ప మరే సౌకర్యాలు లేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పోడు భూములు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కేవలం మూడు కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు చేస్తే చాలు వీరి కష్టాలు తీరినట్టే. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు ఏర్పాటు చేస్తామని స్థానిక నాయకులు హామీలు ఇచ్చినా ఏరు దాటాక....అన్న సామెతలా ఎన్నికలైపోగానే వీరి కష్టాలు ఎవరూ పట్టించుకోలేదని గిరిజనుల ఆవేదన.


అడవిమార్గంలోనే రాకపోకలు

ప్రధానంగా ఇక్కడి గిరిజన ప్రజలకు రోడ్డు లేకపోవడం అవస్థల పాలు చేస్తోంది. ఇక్కడ 15 మంది చిన్నారులు అడవిమార్గంలో జిల్లెడిపూడి గ్రామం వెళ్లి చదువులు సాగిస్తున్నారు. వర్షం కురిస్తే బడికి దూరం అవుతున్నారు. అంతే కాకుండా ఎటువంటి అనారోగ్యం వచ్చినా మూడు కిలోమీటర్ల దూరం అడవిమార్గంలో నడిచి రోడ్డుకు చేరుకోవాలి. పండిన కూరగాయలు, ఇతర వస్తువులు కావిడిపై నడిచి బురదమార్గంలో బయలకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవాలి. రోడ్డు సౌకర్యం కల్పించాలని వీరంతా పలుమార్లు అధికారులు, నాయకులు మొరపెట్టుకున్నారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు.

మంజూరైన నిధులు వెనక్కి...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2024 జనవరిలో ఈ రోడ్డు సౌకర్యం కోసం అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కరక గ్రామం నుంచి డొంకాడ రోడ్డు నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టకముందే ఎన్నికల కోడ్ రావడంతో ఈ సమస్య మొదటికి వచ్చింది. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు సంగతి పట్టించుకోలేదు. ఎన్నికల ముందు కూటమి నాయకులు గ్రామానికి వెళ్లి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఎన్నికలయ్యాక తమవైపు ఎవరూ చూడలేదని ఆవేదన చెందుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలి



కరక నుంచి డొంకాడ గ్రామానికి రోడ్డు లేదు. ఆరిల్లోవ ప్రధాన రోడ్డు నుంచి డొంకాడ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం. పలుసార్లు రోడ్డు నిర్మాణం చేయాలని మండల కేంద్రాల్లో ఆందోళన చేశాం. గత ప్రభుత్వంలో రోడ్డు వచ్చిందని ఆనందపడేలోగా ఎన్నికల కోడ్ వచ్చి పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలోనైనా రోడ్డు ఏర్పాటు చేయాలి. రోడ్డు లేక పిల్లలు చదువులకు దూరం కావడం, ఆరోగ్య సమస్యలు వస్తే సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేక, పండిన పంటను సకాలంలో అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సత్తిబాబు, డొంకాడ గ్రామం